# సావేరి

అనంత్ పెళ్లి అమృతతో జరుగుతోందని శుభలేఖ చూసి అమితా శ్చర్యపోయాను. నా ఎదలో పన్నీటిజల్లు కురిసింది. నా మానస సరోవరంలో ఆనంద తరంగాలు వెల్లివిరిసాయి. అందుకు కారణం అమృత సావేరి చెల్లెలు కావడమే. తోబుట్టువు పెళ్ళికి సావేరి విధిగా విశాఖపట్నం వస్తుంది. వెంటనే వైజాగు బయలుదేరమని నా మనసు తొందరపెట్టింది. ఇటు స్నేహితుడి పెళ్లికి వెళ్ళినట్లు ఉంటుంది. అటు సావేరిని కలుసుకున్నట్లు అవుతుంది. ఆమెను చూసి ఆరు వసంతాలు గడిచిపోయాయి.

ఇప్పుడెలా ఉందో....? ముగ్గురు పిల్లల ముత్తైదయి ఉంటుంది. ఆమె నోమారు చూడాలని ఈ మధ్య కాలంలో ఎన్నిమార్లు అనిపించిందో! అయినా వాళ్ళ ఊరు వెళ్ళలేకపోయాను. ఆమె భర్త నాగపూర్‌లో కెమికల్ ఇంజనీరు. ఏ పరిచయాన్ని పురస్కరించుకుని అక్కడకు వెళ్ళేది? అందుకే నా కోరికకు తెర పడిపోయింది. ఇప్పుడొచ్చిన ఈ అవకాశాన్ని జారవిడుచుకోవద్దని నా అంతరాత్మ గోల చేయసాగింది. అంతే, ఉన్నపళంగా విశాఖపట్నానికి ప్రయాణం కట్టాను.

బస్సులో కూర్చున్నానన్న మాటే గాని మనసంతా సావేరి మీదనే ఉంది. చెట్లు చేమల్ని దాటుకుంటూ బస్సు జోరుగా పోతోంది. కదలిపోతున్న ప్రకృతి సౌందర్యాన్ని నా కళ్ళు వీక్షిస్తున్నా, మనసు మాత్రం సావేరి చుట్టూ పరిభ్రమించసాగింది. మంచు బిందువు కొసన సంగమించిన దినకర మయూఖంలా ఎంతో అద్భుతంగా ఉంటుందామె. సంగీతంలో సావేరి రాగం ఎంత శ్రావ్యంగా ఉంటుందో ఆమె నవ్వుతూ ఉంటే అంత ఆహ్లాదంగా ఉంటుంది.

ఆమె గుండ్రటి ముఖం. నల్లని పొడుగాటి జడ, విప్పిన కలువరేకుల్లాంటి కళ్ళు, నుదుట ఎర్రటి చుక్క బొట్టు మరచిపోదామన్నా మరచిపోలేని ముగ్ధమోహన రూపం ఆమెది. భగవంతుడు మనిషికి రెక్కలే గాని ఇచ్చి ఉంటే బస్సులోంచి గబాలున గెంతేసి రివ్వున ఎగిరి ఆమె ముందు వాలిపోయేవాడిని. మస్తిష్కంలో సావేరి రూపం కదలాడటంతో గతస్మృతులు కలవరపెట్టడం మొదలుపెట్టాయి.

• • •

బి.ఎస్.సి. ఫైనల్ ఇయర్ చదువుతున్న రోజుల్లో దీక్షితులుగారు ట్రాన్స్‌ఫర్ మీద మా ఊరొచ్చి మాపక్క వాటాలో దిగారు. ఆయనకు ఇద్దరాడపిల్లలు. పెద్దమ్మాయి సావేరి ఇంటర్ చదివేది. రెండో అమ్మాయి అమృత ఎనిమిదవ క్లాసు. ఆ ఇద్దరమ్మాయిలు అందంలో ఒకరికొకరు పోటీ పడేవారంటే అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. ఒకే ఇంట్లో ఉండటంవలన మాకు, వాళ్ళకి ఎంతో సన్నిహిత సంబంధ మేర్పడిపోయింది.

సావేరి లెక్కలు చెప్పించుకోడానికి నా రూములో కొచ్చింది.

ఇంద్రధనుస్సు ఇలకు దిగి వచ్చినట్లుగా, రాజహంస రెక్కలు విప్పుకుని నర్తిస్తున్నట్లుగా అనిపించింది. ఆమె అభ్యర్థనను తోసి పారేయలేక నాకు తెలిసినంతవరకు ఆమె సందేహాన్ని నివృత్తి చేశాను. ఆ రోజు లగాయితూ ప్రతి దినం నా దగ్గరకు ట్యూషను కొచ్చేది. మేమెంత చనువుగా ఉన్నా పెద్ద వాళ్ళెవరూ పట్టించుకునేవారు కాదు.

దీక్షితులుగారు తహసీలుదారు అవడంవలన కాంపులు కెళుతూ ఏ రాత్రికో గాని ఇల్లు చేరేవారు కాదు. ఆ కుటుంబానికి మగదక్షత లేనందున ఏ అవసరానికైనా తాయారమ్మగారు నన్నే పిలిచేవారు. కాదనలేకపోయేవాణ్ణి. సావేరి నా దగ్గరకు రాకపోతే నా మనసదోలా అయిపోయేది. ఆమె నాచెంత ఉంటే ఏదో తెలియని అనుభూతి పొందేవాణ్ణి.

మా స్నేహం శుక్లపక్షం నాటి జాబిలివలె దిన దిన ప్రవర్ధమానమైంది. సావేరి తల్లితో ప్రైవేటు క్లాసు ఉందని చెప్పిన ప్రతి ఆదివారం నాతో మ్యాట్నీకి కొచ్చేది. సాయంత్రాలు చెరువు గట్లంట షికారుగా వెళ్ళేవాళ్ళం. సెలవు దినాల్లో కారమ్సు బోర్డు దగ్గర కూర్చుని భోజనానికి రమ్మని పదికబుర్లు పెట్టేంతవరకు లేచేవాళ్ళం కాదు.

అనుకోకుండా ఆ సంవత్సరం అన్నయ్యకు మారేజ్ సెటిలయింది. ఇహ పెళ్ళిలో సందడంతా మాదే. సావేరి కంచిపట్టు చీర కట్టుకుని ముత్తైదులకు కుంకుమ పెట్టి పన్నీరు చల్లితే, నేను పెళ్ళికి వచ్చిన వారందరికీ మిఠాయి పొట్లాలు పంచాను. వధూవరులు తలంబ్రాలు పోసుకుంటూ ఉంటే మేమిద్దరం ముసి ముసి నవ్వులు నవ్వుకున్నాం.పెళ్ళి పీటల మీద మేమే ఉన్నట్లుగా ఊహించుకుని మురిసిపోయాం.

మాకు తెలియకుండానే రోజులు, వారాలు, నెలలు గడచిపోసాగాయి. పరీక్ష అయిపోవడం, రిజల్ట్సు వెలువడడం క్షణాలమీద జరిగిపోయాయి. పేపర్లో నా నంబరు కనబడటంతో నా ఆనందానికి అవధులు లేవు. ముందుగా ఈ శుభవార్త సావేరికి చెప్పి ఆమె నోటికి స్వీటు అందించాను.

కంగ్రాట్స్ చెప్పింది సావేరి. నా ఆనందంలో భాగం పంచుకుంటూ.

ఆ రోజు సాయంత్రం ఇరువురం అలవాటుగా చెరువు గట్టున కూర్చున్నాం.

"ఎప్పుడూ మనం ఇలాగే ఉండిపోతే ఎంత బావుంటుంది మధూ!" అన్నది సావేరి నా గుండెమీద తల ఆన్చి. ఆక్షణం ఆమె కళ్ళలో ఏదో అనిర్వచనీయమైన ఆర్ద్రత ఇమిడి ఉంది.

"ఎందుకు బాగుండదు? రేపు మీ నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అయితే...." అన్నాను ఆమె నుదుట మీద పడి అల్లరి చేస్తున్న నీలి ముంగురులను సుతారంగా సవరిస్తూ.

"ఈలోగా నన్ను పసుపుతాడుతో బంధిస్తే పోలా?" అంది సావేరి ఊరంత బిడియపడిపోతూ.

ఆమె మాటలకు నా మనసు సంతోషంతో ఉరకలు వేసింది.

"ఇవాల్టి నుండి ఉద్యోగాన్వేషణలో పడతాను. పని దొరకగానే పెద్దవాళ్ళకు మన అభిప్రాయంచెబుదాం!" అన్నాను ఆమె కళ్ళల్లో కళ్ళుంచి.

సిగ్గుతో తల దించుకుంది సావేరి.

విసుగు విరామం లేకుండా పేపర్లో కనిపించిన ప్రతి ఉద్యోగానికి దరఖాస్తు పడేశాను.

నాకు త్వరగా ఉద్యోగమవ్వాలని భగవంతుణ్ణి మనసులో ధ్యానించుకుంది సావేరి.

ఉన్నట్లుండి దీక్షితులుగారికి విశాఖపట్నం బదిలీ అయిందన్న పిడుగు లాంటి

వార్త నా చెవుల్లో పడింది. మా ఇరువురి హృదయాల్లో పెనుతుఫాను చెలరేగింది.

"నేను విశాఖ వెళ్ళిపోతే నన్ను మరచిపోవు కదూ!" అమాయకంగా అన్నది సావేరి వియోగబాధను ఎలా అనుభవించాలో అర్థం గాక.

"ఛ! అలా ఎందుకనుకుంటావ్. నిన్ను చూడకుండా నేను మాత్రం ఉండగలననుకుంటున్నావా? ఉద్యోగం దొరకగానే మీ ఊరొచ్చి నిన్ను పరిణయమాడుతానని మీ వాళ్ళకు చెబుతాను.. సరేనా?" అన్నాను ఆమెను సాంత్వన పరిచే ప్రయత్నం చేస్తూ.

ఆ రోజంతా మేము ఎవరేమనుకుంటారో నన్న బెదురులేకుండా గడిపేశాము. పగలే తియ్యని కలలు కన్నాం. ఎన్నెన్నో కబుర్లు చెప్పుకున్నాం. మరెన్నో బాసలు చేసుకున్నాం.

దీక్షితులుగారు వైజాగ్ వెళ్ళిన ఆరు నెలల తరువాత మాకో శుభలేఖ వచ్చింది.

సావేరికి పెళ్ళి అని తెలిసి నా గుండె ఆగిపోయినంత పనైంది. మేము నిర్మించుకున్న ఆశా సౌధాలన్నీ కుప్పలా కూలిపోయాయి. ప్రకృతి స్తంభించిపోయినట్లైంది.

తండ్రి చాటు బిడ్డ నిరుద్యోగినైన నన్ను కట్టుకుంటానని చెప్పే ధైర్యం లేక పాపం పెళ్ళికి ఊఁ కొట్టిందేమో!

వైజాగు రావడంతో నా ఆలోచనలకు బ్రేకులు పడ్డాయి.

కాంప్లెక్సులో దిగుతూనే సిటీ బస్సు కోసం ఎదురుచూడకుండా ఆటో కట్టించుకుని దీక్షితులుగారింటికి వెళ్ళాను. సావేరిని చూసేందుకు నామనసు తొందర చేయసాగింది.

గుమ్మంలో అడుగు పెట్టగానే తాయారమ్మగారు నన్నెంతో ఆప్యాయంగా పలకరించి లోపలకు తీసుకెళ్ళారు.

వాకిట్లో పెళ్ళి పందిరి మామిడి తోరణాలతో రమ్యంగా ముస్తాబై ఉంది.

దీక్షితులుగారు నన్ను చూసి చిరునవ్వు నవ్వుతూ "ఒక్కడివే వచ్చావేం? మీ అమ్మగారిని కూడా తీసుకొని వస్తే ఎంతో బాగుండేది" అన్నారు.

తాయరమ్మగారు ప్లేట్లో అడ్డాలు పెట్టి పట్టుకొచ్చారు.

టిఫిన్ చేస్తూ వాళ్ళతో మాట్లాడుతున్నానే గాని నా నయనాలు సావేరీకోసం అన్వేషణ ప్రారంభించాయి.

నా మనోభావాన్ని తాయారమ్మగారు పసిగట్టినట్లుంది. "నాగపూరు నుంచి

సావేరి వచ్చింది. పిలుపుల కెళ్ళింది." అన్నది యథాలాపంగా.

ఫలహారం ముగించి ఆ ఇంట్లో అటూఇటూ తిరగడం మొదలుపెట్టాను. అందరూ అపరిచితులవడంవలన సమయం భారంగా గడవసాగింది. నా ఆలోచనా, ఆరాటం అంతా సావేరే. ఆమెను చూడటానికే నేనింత దూరం వచ్చింది.సాయంత్రం ఆరు గంటలకు పిలుపులు పూర్తి చేసుకుని వచ్చారు ముత్తైదులు. వారిలో సావేరి కూడా ఉంది. పెళ్ళై ఆరేళ్ళు దాటినా ఆమె అందం చెక్కు చెదరలేదు.

నన్ను చూడటంతోనే మురిపెంగా నా దగ్గర కొచ్చి కుశల ప్రశ్నలు వేస్తుందనుకున్నాను. ఇన్నాళ్ళూ నన్ను చూడకుండా ఎలా ఉన్నావని నిలదీసి అడుగుతుందేమో అనుకున్నాను. అయితే అందుకు భిన్నంగా నన్ను చూడటమే మహాపాప మన్నట్లు ముఖం పక్కకు తిప్పుకుంది.

చివుక్కుమంది నాహృదయం. నేను వచ్చిందే ఆమెకోసం. చనువుగా పలకరించి తన సంసార విషయాలు చెబితే నేనెంత సంతోషించేవాణ్ణి. ఆమె ఎక్కడ ఉన్నా సుఖంగా ఉండాలనే నేనిన్నాళ్ళూ కోరుకున్నాను. నేను ఎవరికోసం అంత దూరం వచ్చానో ఆ వ్యక్తి నన్ను చూడటానికి కూడా ఇష్టపడటంలేదని గ్రహించాక మరి అక్కడ నిలువబుద్ధి కాలేదు. ఆమె ప్రవర్తనకు నా గుండెను ఎవరో పిసుకుతున్నంత బాధ కలిగింది.

వెంటనే వెళ్ళిపోతే బాగుండదని ముహూర్తం వరకు ఉండి, తెల్లవారుజామున వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాను. ఆ రోజంతా ఆమె ఎవరో పరిచయం లేని వ్యక్తిలా ప్రవర్తించే సరికి నేనెంత కలత చెందానో? నా మనసు వికలమై పోయింది. అతి కష్టం మీద అక్కడ నుంచి బయటపడి మా ఊళ్ళో పడ్డాను.

సావేరి దృష్టిలో నేను పరాయివాడినై పోయానన్న తలంపు రావడంతో నాహృదయం చిత్రవధకు గురైంది. పెళ్ళికి వెళ్ళకుండా ఉంటే ఎంతో బావుండే దనిపించింది. మనసు బాగోలేక వారం రోజులు ఆఫీసుకు సెలవు పెట్టి ఇంట్లోనే గడిపాను. సావేరి నన్ను ఎందుకు ద్వేషిస్తుందో ఎంత బుర్ర బద్దలుకొట్టుకున్నా బోధపడటంలేదు.

పదిహేను రోజులు గడచిపోయాయి.

ఆరోజు రెండవ శనివారం అవడంవలన ఇంట్లోనే ఉన్నాను. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పోస్టుమాను కవరొకటిచ్చి వెళ్ళిపోయాడు.

అనంత్ తన వైవాహిక జీవితాన్ని విశ్లేషిస్తూ ఉత్తరం రాసుంటాడనుకుని కవరు

చించాను. హేండ్ రైటింగ్ చూడగానే ఆ ఉత్తరం సావేరి రాసిందని నాకు వెంటనే అవగతమై పోయింది. చకచకా ఉత్తరంలోకి దృష్టి సారించాను.

"మధూ!

సావేరి నీకు ఉత్తరం రాస్తున్నదంటే ఆశ్చర్యంగా ఉంది కదూ! నేను నీకు రాసే ఈ మొదటి ఉత్తరం బహుశా ఆఖరి ఉత్తరం కావచ్చు. దయచేసి జవాబు ఇవ్వడానికి ప్రయత్నించకు.

నువ్వు మా చెల్లాయి పెళ్ళికి మావారింటికి వచ్చినప్పుడు నేనెందుకలా ప్రవర్తించవలసి వచ్చిందో చెప్పడానికి మరో మార్గం కానరాకపోవడంతో ఇలా అక్షర రూపం ఇవ్వవలసి వచ్చింది.

నన్ను చూడాలని నువ్వెంత ఆశపడి ఉంటావో నాకు తెలుసు. అంత దూరం నుంచి వచ్చిన నిన్ను కనీసం పలకరించనందుకు నువ్వెంత బాధపడి ఉంటావో నేనెరుగుదును. ఇక ఎప్పుడూ నీ ఎదుటపడే భాగ్యం లేదని చెప్పుకోడానికి నేనేమీ బిడియపడటం లేదు.

నన్ను అందంగా అలంకరించి ఒక ఇంజనీరు ముందు కూర్చోబెట్టారు. అతడితోనే నా జీవితం ముడిపడి ఉందని శాసించారు. మగవాడివైన నువ్వే ధైర్యం చేసి నన్ను చేపడతానని చెప్పుకోలేక మౌనం వహించావు. అటువంటప్పుడు ఈ ఆడపిల్ల పెద్దల మాట నెలా ప్రతిఘటించగలదు? నీ ప్రేమను పొందలేక పోయినందు కానాడు నేనెంత చిత్రహింసకు గురి అయ్యానో ఎలా చెప్పమంటావ్? కట్టుకున్న భర్త గొప్ప ఆదర్శవంతుడని, సంస్కారమూర్తి అని తలచాను. పరిస్థితులతో రాజీపడి ఆయనచేత మూడు ముళ్ళూ వేయించుకున్నాను. తరువాత తెలిసింది అతడు వట్టి అనుమానపు మనిషని.

మెట్టి నింట్లో కాలుమోపిన మరుక్షణం నన్నో జడపదార్థంగా మార్చివేశారు. నా వ్యక్తిత్వమంతా హరించుకుపోయింది. నేను ఎవరి ఎదుట పడకూడదు. మగవాళ్ళతో మాట్లాడకూడదు. స్వతంత్రించి ఎక్కడికీ వెళ్ళకూడదు. ఇవి ఆయన నాకు విధించిన ఆంక్షలు. ఖరీదైన జీవితానికి నోచుకున్నానే తప్ప నాకు పంజరంలోని చిలుకకు తేడా లేదు. పెళ్ళైన ఈ ఆరేళ్లలో ఒక్కమారు కూడా పుట్టింటికి వెళ్ళలేదంటే నువ్వే కాదు ఎవరూ నమ్మరేమో!

తోబుట్టువు పెళ్ళికి రాకుంటే బావుండదని విధిలేక నన్ను తీసుకొచ్చారు. నేను ఎక్కడికి వెళుతున్నా, ఏం చేస్తున్నా అతని కళ్ళన్నీ నామీదనే. అందుకే ధైర్యం

చేసి నీముఖంలోకి సూటిగా చూడలేకపోయాను. నన్ను అర్థం చేసుకుని మనస్ఫూర్తిగా క్షమిస్తావని తలుస్తాను. నేను ఒంటరిగా ఉన్నప్పుడెల్లా నీతో గడిపిన మధుర క్షణాలు, నీ చిలిపి చేష్టలు నాకు గుర్తు వస్తూనే ఉంటాయి. నా జీవితానికవే తీపిగుర్తులు.

ఇట్లు
సావేరి."

సావేరి వ్యక్తిత్వాన్ని, స్వేచ్ఛను హరించివేసిన ఆమె భర్త మీద అమితమైన ఆగ్రహం వచ్చింది. నేను అశక్తుణ్ణి. నా మనసంతా కకావికలమై పోయింది. వాస్తవాన్ని మరుగుపరచి నామీద కోపంతో ఆనాడు అలా ప్రవర్తించానని రాసుంటే నే నింతగా బాధపడేవాడిని కాదు.

● *ఆంధ్ర ప్రభ వీక్లీ, 5–9–90* ●